క్లుప్తంగా

రికార్డుల నిర్వహణ భేష్

తంబళ్లపల్లె: స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో రికార్డుల నిర్వహణ భేష్ అని సోమవారం డీటీఏఓ జయలక్ష్మి తెలిపారు. మూడు రోజులుగా డీటీఏఓ ఆధ్వర్యంలో తనిఖీ బృందం ఎస్‌టీఓ రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్లు ఆనందబాబు, వెంకటేశ్‌లు 2024 -25 సంవత్సరానికి సంబంధించి వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు క్షుణంగా పరిశీలించారు. ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు సంబంధిత బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యంగా జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్‌టీఓ మారెమ్మకు సూచించారు.

25న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

కలికిరి: కేవీకే కార్యాలయంలో ఈ నెల 25న పుట్టగొడుగుల పెంపకంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డా. మంజుల తెలిపారు. మహిళలు, యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. అలాగే 26న శుక్రవారం విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అవకాశాలను మహిళలు, యువత సద్వినియోగపరచుకోవాలని ఆమె కోరారు.

వాహనమిత్ర పథకానికి 140 దరఖాస్తులు


మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినారాయణ

ములకలచెరువు: మండల వ్యాప్తంగా వాహన మిత్ర పథకానికి 140 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ హరినారాయణ అన్నారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడాలని ఆదేశించారు. వర్షా కాలం కారణంగా వైద్య సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.

నేడు ఉచిత కంటి శిబిరం

బి.కొత్తకోట: స్థానిక భారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్టు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కంటిరోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటీ కోసం నిరసన

బి.కొత్తకోట: తాగునీటి సమస్యను పరిష్కరించాలని నగర పంచాయతీ పరిధిలోని బద్దిపల్లె గ్రామస్తులు సోమవారం కార్యాలయంలో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ట్యాంకర్లతో నీటి సరఫరా వద్దని శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. చాలాకాలంగా ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమీషనర్ పల్లవి మాట్లాడుతూ బద్దిపల్లెకు తాగునీటి బోరు మంజూరైందని, బోరువేసి శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఆస్తి అన్యాక్రాంతంపై ఫిర్యాదు

కలికిరి: ప్రభుత్వ ఆస్తులు ఎక్కడైనా అన్యాక్రాంతమైనా.. ఆక్రమణలకు గురైనా రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సివుంది. అయితే కలికిరి మండలంలో ప్రభుత్వ చెరువు ఆక్రమణకు.. సదరు ఆక్రమణపై గ్రామస్తులు జిల్లా కలెక్టరుకు పీజీఆర్ఎస్‌లో స్వయంగా ఫిర్యాదు చేసినా.. రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో గ్రామస్తులు తాజాగా సోమవారం జిల్లా కలెక్టరుకు మరోసారి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

రెడ్డిజాగృతి జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జునరెడ్డి



తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నె పంచాయతీ చెరువుముందరపల్లెకు చెందిన ఎస్.మల్లికార్జునరెడ్డి రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం రెడ్డి జాగృతి వ్యవస్థాప అధ్యక్షులు మాధవరెడ్డి నియామకపు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. మల్లికార్జునరెడ్డి వ్యాపారరీత్యా బిల్డర్‌గా బెంగళూరులో స్థిరపడ్డారు. ఈయన తంబళ్లపల్లె నియోజకవర్గం, బెంగళూరులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి మంచి గుర్తింపు పొందాడు. రెడ్డి కమ్యూనిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

సమస్యలపై సత్వర పరిష్కారం

మదనపల్లె: సమస్యలపై అందే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చేస్తామని కమిషనర్ కే.ప్రమీల అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మూడు, ప్రజారోగ్యానికి సంబంధించి ఒక ఫిర్యాదులు అందాయి. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

జగన్మాతా.. నమోస్తుతే

- ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- భక్తులతో సందడిగా ఆలయాలు



మదనపల్లె: లలితత్రిపురసుందరి అలంకారంలో అమ్మవారు


పీలేరు: వాసవిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


కేవీపల్లె: బాలత్రిపురసుందరి అలంకరణలో చౌడేశ్వరిదేవి


కలకడ: ప్రత్యేక అలంకరణలో శ్రీచౌడేశ్వరిదేవి


కలికిరి: బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో ఎల్లమ్మ


బి.కొత్తకోటలో కొలువైన దుర్గాదేవి


కలికిరి: సోమేశ్వరస్వామి ఆలయంలో లలితసహస్రనామ కుంకుమార్చన చేస్తున్న మహిళలు


గుర్రంకొండ: రెడ్డెమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ: అమ్మలగన్న అమ్మ...ముగ్గురమ్మల మూలపుటమ్మ.. జగన్మాతకు ప్రణమిల్లుతున్నారు. నన్ను, నా కుటుంబంతో పాటు లోకంలోని ప్రజలందరినీ చల్లగా చూడాలని అమ్మవారి ఆలయాల్లో భక్తులు మనసారా పూజలు చేశారు. ఆలయాలు ఉత్సవకళను సంతరించుకున్నారు. ప్రత్యేక అలంకారాల్లో అమ్మవారిని దర్శించుకుని తన్మయులయ్యారు. మదనపల్లె పట్టణంలోని వాసవీభవన్‌వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం ఉదయం సుప్రభాతం, అభిషేకం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం ఎస్‌బీఐకాలనీ, గొల్లపల్లి రింగ్‌రోడ్డు,రామారావుకాలనీ, సిటీఎం రోడ్డుకు చెందిన భక్తులు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అమ్మవారిని హంసవేణి అలంకారంలో అలరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు పూనగంటి ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, ఉపాధ్యక్షులు గిరిధర్, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ ప్రారంభించారు. శ్రీలలితాత్రిపురసుందరిదేవిని శ్రీలలిత్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక సీటీఎం రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. స్థానిక బెంగుళూరురోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామికి పూజలు చేశారు. స్వామిని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి అలంకారం చేశారు. కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మ, సీటీఎంలోని నలవీరగంగాభవానీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి శ్రీ బాలత్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన సోమవారం రెడ్డెమ్మతల్లితోపాటు గుర్రంకొండ గ్రామదేవత శ్రీపోలేరమ్మ తల్లి, శ్రీ గంగమ్మతల్లి, శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకొని కలశస్థాపన, గణపతిపూజ, పుణ్యాహవాచనం కావించారు. రెడ్డెమ్మతల్లి ఆలయం వద్ద కోలాటాలు, చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించారు.

బాలత్రిపుర సుందరిగా అంకాలమ్మ

పీలేరు : విజయదశమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారు మొదటి రోజు బాలత్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. సోమవారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక నెహ్రూబజార్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి వాసవిదేవి అలంకారంలో మొదటి రోజు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో శ్రీ యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

చౌడేశ్వరిదేవికి విశేష పూజలు

కేవీపల్లె : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చీనేపల్లెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి మొదటి రోజు విశేష పూజలు నిర్వహించారు. సోమవారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి బాలత్రిపురసుందరిదేవిగా అలంకరణ చేశారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : దశరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కలకడ, గుడిబండ, కోన, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె గ్రామాలలో వెలసిన గ్రామదేవత చౌడేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు తొగట వీర క్షత్రియులు ప్రత్యేక అలంకరణ చేసి, ఖడ్గప ద్యాలు పలికి, అభిషేకం పూజలు చేశారు.

బాలత్రిపురసుందరీ దేవి అలంకారంలోఎల్లమ్మ

కలికిరి: గ్రామ దేవత ఎల్లమ్మ బాలత్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సుప్రబాత సేవ, పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అలాగే పట్టణంలో వెలసిన పార్వతీసమేత సోమేశ్వరాలయంలో అమ్మవారు సప్తమ్మాత్రుక మహిశాశురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలో సాయంత్రం సామూహిక లలిత సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

బి.కొత్తకోట: దేవీనవరాత్రి ఉత్సవాలను బి.కొత్తకోటలోని ఆలయాల్లో ఏటా ఘనంగా నిర్వహించేవారు. ఈ ఉత్సవాలను నిర్వహణ కమిటీ ప్రత్యేకంగా చేపట్టింది. స్థానిక జ్యోతిచౌక్‌లో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తొలిరోజు ప్రత్యేక పూజలు, ఆలంకరణ తో కొలువుదీర్చగా భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

ఆలయ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు

సబ్ కలెక్టర్‌కు ఎద్దులవారికోట ప్రజల వినతి


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె రూరల్ : తంబళ్లపల్లె మండలం కొటాల గ్రామం ఎద్దులవారికోటకు చెందిన నిమ్మకంత గంగమ్మ, వడ్డిమారెమ్మ, పెద్దన్న గురుదేవస్వామి గుడులకు సంబంధించిన ప్రభుత్వ భూమిని, వ్యవసాయ భూమిలో కలుపుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి వినతిచేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు అర్జీలు సమర్పించారు.

ఆలయ స్థలాలు సర్వే చేయించండి

ఎద్దులవారికోట గ్రామంలో సుమారు 500 కుటుంబాలకు చెందిన వారు మూడు గుడుల్లో పూజాకార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఆలయానికి సంబంధించిన ప్రభుత్వ భూమి, గుడికి వెళ్లే దారిని ఇరువైపులా ఉన్న వ్యవసాయదారులు ఆక్రమించేశారన్నారు. నిమ్మకంత గంగమ్మ గుడి సమీపంలోని సింహాసన ఒడ్డు చెరువును ఆక్రమించుకుని, చదునుచేసి పంటలు సాగుచేయడమే కాకుండా షెడ్లు నిర్మించుకున్నారన్నారు. మండల సర్వేయర్ ద్వారా గుడులకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను సర్వే చేయించి న్యాయం చేయాల్సిందిగా గ్రామస్తులు కోరారు.

వీఆర్‌పే కుమారుడు రికార్డులు మార్పుచేశాడు

ములకలచెరువు మండలం చౌడసముద్రంకు చెందిన, ఎస్సీ,ఎస్టీ, బీసీ రైతులైన తమకు తంబళ్లపల్లె మండలం కోట్లపల్లె గ్రామంలో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చారు. 40 ఏళ్లుగా భూముల్లో తాము వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. కొట్లపల్లె వీఆర్‌పే వేణు కుమారుడు ఉమేష్ తాత్కాలికంగా వీఆర్‌పేగా పనిచేస్తూ భూరికార్డులు మార్పుచేసి ఊటువెంకటప్ప, తిరుమలప్ప, ఊటు మల్లమ్మ, నత్తి కదిరమ్మలకు చెందిన భూములు తారుమారుచేసి ఆక్రమించి బోరు వేయిచాడు. బంధువుల పేర్లుతో రికార్డుల్లో నమోదు చేశాడు. సదరు భూమిలో రైత్వారీ పట్టాలు ఉన్నందున రికార్డుల ప్రకారం సబ్‌డివిజన్, సర్వే చేయించి భూములు అప్పగించాలని ములకలచెరువు సీపీఐ అంజనప్ప, చాన్‌బాషా, రమణ తదితరులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు.

దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

బసినికొండ గ్రామం సర్వేనెం.10421-1, 1037-1బి నెంబర్లలోని ప్లాట్‌నెం.96కు సంబంధించి ఉత్తరం వైపు దారి కనపరచడం జరిగిందని, ఈ సర్వేనెంబర్లలో మిగిలిన ప్లాట్లు కొనుగోలుచేసిన కొందరు దారిని ఆక్రమించడంతో తన ప్లాటుకు దారిసమస్య ఏర్పడిందని మహల్‌కు చెందిన షేక్ హమీదాభాను ఫిర్యాదుచేసింది. ఇల్లు కట్టుకునేందుకు ఇబ్బందిగా ఉన్నందున దారి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది.

పట్టాలిచ్చి స్థలం చూపడం మరిచారు...

మదనపల్లె పట్టణం అనపగుట్టలో నివాసం ఉంటున్న హరిత, తులసమ్మ, కమల లక్ష్మి....పోతబోలు జగనన్న లేఅవుట్‌లో సర్వేనెం.1308, 1309లో తమకు ప్లాటునెం.17, 45, 46 కింద పట్టాలు మంజూరుచేశారని, అయితే రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు స్థలాలు చూపలేదన్నారు. ప్రస్తుతం కొత్తగా ఇంటికోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరైనట్లుగా చూపిస్తోందని, తమకు స్థలం చూపించాలని, లేనిపక్షంలో పట్టాలను రద్దుచేయాలని కోరారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. మల్లయ్యకొండకు వెళ్లే మార్గమధ్యంలో వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయంలో పూజారులు విజయకుమారి, శేఖర్‌లు అమ్మవారికి శరన్నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్దతిప్పసముద్రం శ్రీలక్ష్మినరస్వతి కోటాల బృందం హర్షిత,రోజా, రవణమ్మల ఆధ్వర్యంలో సభ్యులు నిర్వహించిన కోలాటం భక్తులను అలరింపజేసింది. ఈఓ మునిరాజ, కొండకిట్టల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

మతిమరుపును తగ్గించుకోవచ్చు

మదనపల్లె సిటీ: మతిమరుపు అనేది లైఫ్‌స్టైల్ చెంజెస్ ద్వారా తగ్గించుకోవచ్చునని విశ్రాంత జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పూల వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ప్రపంచ అల్జీమర్స్ డే నిర్వహించారు. శారీరకంగా, మానసికంగా, ముఖ్యంగా చెస్, క్యారమ్స్ వంటి ఆటలు ఆడటం వల్ల అల్జీమర్స్ వ్యాధిని కొంతవరకు నివారించవచ్చునన్నారు. దీనికి కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో ఉండాలని వివరించారు. శరీరానికి ఆహారం ఏ విధంగా అవసరమో, మెదడుకుఆ తగిన విశ్రాంతి, యోగ, మెడిటేషన్ అవసరమని దీని ద్వారా మతిమరుపు తగ్గించుకోచ్చునని తెలిపారు .వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మతిమరుపు వ్యాధిని మొదటిలోనే కనుగొని చికిత్స మొదలు పెడితే కొంత వ్యాధి తీవ్రతను తగ్గించుకోచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛా నదికి జలహారతి


పింఛా నదిలో పూజలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ హబీబ్‌బాషా, వార్డుమెంబర్లు

పీలేరురూరల్ : మండలంలోని బాలంవారిపల్లె వద్ద గార్గయ ప్రాజెక్టు నిండి పింఛానదిలోకి నీరు ప్రవహిస్తుండడంతో సర్పంచ్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో జలహారతి పట్టారు. సోమవారం గార్గేయ ప్రాజెక్టులో ఉన్న పంపింగ్ మోటార్లను పరిశీలించారు. అనంతరం పింఛా నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార్గేయ ప్రాజెక్టు నిండిపోవడంతో పీలేరుకు తాగునీటి సమస్య ఉండదని తెలిపారు. మరోవైపు భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు విక్టరీ వెంకటరమణారెడ్డి, మల్లికార్జున రెడ్డి, కాలేషా, సచిన్, అబీద్, పరమేష్, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో మదనపల్లె జిల్లా ప్రకటించాలి

– మదనపల్లె జిల్లా సాధన సమితి డిమాండ్


మాట్లాడుతున్న పీటీయం శివప్రసాద్

మదనపల్లె రూరల్ : ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే మదనపల్లె జిల్లా ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటనచేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌లు ప్రజలకు ఇచ్చిన హామీ నిలుపుకోవాలని పీటీయం.శివప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లె జిల్లా సాధనసమితి కన్వీనర్ హోదాలో స్థానిక బాస్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే మదనపల్లె జిల్లా ఏర్పాటుచేస్తామని, స్థానికంగా జరిగిన మినీ మహానాడు, బెంగళూరు బస్టాండ్ ఎన్నికల బహిరంగసభలో చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో నారాలోకేష్ హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మదనపల్లె జిల్లా ఏర్పాటుపై ఇప్పటికే రెండుసార్లు అసెంబ్లీలో ప్రస్తావించారని, అయినప్పటికీ ప్రభుత్వ పెద్దల నుంచి ఎలాంటి స్పష్టత లేదన్నారు. ఈ పరిణామాలు మదనపల్లె ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో మదనపల్లె జిల్లా సాధనసమితి ప్రతినిధులు నీరుగట్టి రమణ, దేగానిరమణ, తెట్టుశ్రీనివాసులు, సొన్నికంటి రెడ్డెప్ప, పెద్దపాలెం రవిశంకర్, తలారికృష్ణ, బురుజురెడ్డిప్రసాద్, గూడుపల్లె గంగులప్ప, సయ్యద్‌బాషా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల్లో తేడా వస్తే చర్యలు


వేయింగ్ మిషన్లు పరిశీలిస్తున్న జిల్లా తూనికలు, కొలతల అధికారి ఎం. దివ్య

పీలేరురూరల్ : తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతల అధికారిణి ఎం. దివ్య అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణాల్లో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లకు ముద్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 800 ప్రభుత్వ చౌకదుకాణాలు ఉన్నాయన్నారు. పీలేరు 56 ఉన్నాయని, డీలర్లు వినియోగిస్తున్న వేయింగ్ మిషన్లను ఏడాదికోసారి పరిశీలించి ముద్రలు వేస్తున్నట్లు తెలిపారు. తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయర్స్ డీటీ విజయ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు అకౌంటెంట్‌పై విచారణ

నిధులు దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ములకలచెరువు: స్థానిక వెలుగు కార్యాలయంలోని అకౌంటెంట్ సాయిలీల నిధులు దుర్వినియోగం చేసినట్లు ములకలచెరువుకు చెందిన సోమశేఖర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై సోమరవారం ఎంపీడీఓ హరినారాయణ, ఏపీఎం మధుబాబు విచారణ చేపట్టారు. వివరాలిలా.. ములకలచెరువులో సీత, తులసి, కదిరినాధుని కోటకు చెందిన నందిని మహిళా సంఘాల్లోని ముగ్గురు మహిళల పేరు మీద స్త్రీనిధి ద్వారా నగదు తీసుకున్నట్లు, అలాగే సంఘాలకు నిధులు మంజూరు చేస్తే రూ. 1000 వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే సమావేశాలు నిర్వహిస్తే భోజనం, నీళ్ల ఖర్చు అంటూ బిల్లులు పెట్టకోవడం, స్వీపర్లుగా పనిచేస్తున్న మహిళలకు సైతం జీవతం ఇవ్వడం లేదంటూ ఫిర్యాదులు వెళ్లాయి. మరో రోండు రోజుల పాటు విచారణ చేయాల్సి ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామన్నారు.

గ్రామీణ రోడ్లు గుంతలమయం


యర్రగుంట్లపల్లె పంచాయతీలో రోడ్ల దుస్థితి

పీలేరు : దేశ ప్రగతికి పల్లెలే పట్టుకొమ్మలు అనే ప్రతి ఒక్కరూ చెప్పే మాట. అయితే పల్లెల ప్రగతి గూర్చి పట్టించుకునే నాధుడే లేడనడానికి గుంతలమయమైన రోడ్లు నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. పలు గ్రామాలకు ఉన్న తారు రోడ్లు పూర్తిగా గుంతలమయమై అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని యర్రగుంట్లపల్లె నుంచి తిరుపతి రోడ్డు వరకు, యర్రగుంట్లపల్లె నుంచి చిత్తూరు రోడ్డు మార్గం వరకు, అలాగే కొడిదపల్లె రోడ్డు, చిత్తూరు రోడ్డు నుంచి ఇ-రామిరెడ్డిగారిపల్లె రోడ్డు, కడప రోడ్డు మార్గం నుంచి గోరంట్లపల్లె రోడ్డు ఎటు చూసినా తారు లేచిపోయి గుంతల పడ్డాయి. ఈ మార్గాల్లో వాహన చోదకులు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో గుంతలను గుర్తించలేక ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరికొన్న చోట్ల కల్వర్టులుసైతం దెబ్బతిన్నాయి. రోడ్ల తాత్కాలిక మరమ్మతుల గూర్చి సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి గుంతలమయమైన రోడ్లు బాగు చేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునే దిక్కులేరు..

యర్రగుంట్లపల్లె పంచాయతీలో కురవపల్లె, బసిరెడ్డిగారిపల్లె, చెక్కెరవాండ్లపల్లె, కొడిదపల్లె గ్రామాల మీదుగా వెలుతున్న తారు రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ఈ మార్గంలో వెలుతున్న వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- భానుప్రకాష్‌రెడ్డి, యర్రగుంట్లపల్లె.

మదనపల్లె మున్సిపాలిటీలో పచ్చ అజెండా

- రూ.16 కోట్ల పనులకు అజెండా
- తిరస్కరించిన చైర్మన్

మదనపల్లె: మదనపల్లె సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీకి ప్రజలు ఎన్నుకున్న కౌన్సిల్ ఉన్నప్పటికి అధికారుల ఏకపక్ష నిర్ణయాలపై కౌన్సిలర్లు భగ్గుమంటున్నారు. పైసా ఖర్చు చేయాలన్నా, ఏపని చేపట్టాలన్నా కౌన్సిల్ అనుమతి తీసుకోవాలి. అత్యవసర పనులపై చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకోవాలి. కౌన్సిల్ సమావేశాల నిర్వహణ తేదీ, అజెండాలో పెట్టాల్సిన అంశాలు, అభివృద్ధి పనులు సహా ఏ పనైనా, ఏ విషయమైనా చైర్మన్, కౌన్సిల్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లడం, వారు సూచించిన పనులకు ప్రాధాన్యత ఇచ్చి అజెండా రూపొందిస్తారు. అయితే మదనపల్లె మున్సిపల్ కార్యకలాపాల్లో కౌన్సిల్‌ను అధికారులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదన్న విషయంలో మరోసారి స్పష్టమైంది.

అజెండాను తిరస్కరించిన చైర్మన్

సెప్టెంబర్‌కు సంబంధించి కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. దీనితో ఈనెల 16న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించిన అధికారులు 55 అంశాలతో తయారుచేసిన అజెండా కాపీని చైర్మన్ వరపన మనూజకు పంపారు. దీన్ని పరిశీలించిన ఆమె తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా, కౌన్సిలర్లతో చర్చించకుండా అభివృద్ధి పనులను ప్రతిపాదించడం, కౌన్సిల్ నిర్వహణపై తనను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడంపై చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అజెండాకు, కౌన్సిల్ నిర్వహణ తేదీకి ఆమోదం తెలపకుండా తిరస్కరించారు. దీనితో సమావేశ నిర్వహణ ఆగిపోయింది.

రూ.16 కోట్లకు ప్రతిపాదనలు

మదనపల్లె పట్టణంలో మున్సిపాలిటీ ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్లకు తెలియకుండానే అజెండా సిద్ధమైపోయింది. అదికూడా లక్షో, రెండులక్షలతో చేపట్టే పనులు కాదు ఏకంగా రూ.16 కోట్లతో పనులు. కేవలం ఒక అజెండాలోనే ఇంతభారీ మొత్తంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేటప్పుడు కౌన్సిలర్ల అభిప్రాయాలు తీసుకోకనే అధికారులే ఎక్కడ ఏఏ పనులు చేయాలో నిర్ణయం తీసుకుని కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో పెట్టారు. అందులో ఒక్కోపని రూ.20 నుంచి రూ.40 లక్షల వరకు పెట్టారు.

కావాలనే నిర్లక్ష్యం

మదనపల్లె మున్సిపాలిటిలో 35 మందికి 33 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీకి చెందినవారు. టీడీపీకి కేవలం ఇద్దరు మాత్రమే కౌన్సిలర్లు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారుల తీరు మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమితులైన అధికారులే ఇప్పుడు పనిచేస్తున్నారు. అప్పుడు నిబంధనల మేరకు నడుచుకున్న అధికారులు ఇప్పుడు ఎందుకు బేఖాతర్ చేస్తున్నారని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు.

కౌన్సిల్ మీట్ జరుగుతుందా

ఈనెల16న అధికారులు జరపాలనుకున్న కౌన్సిల్ మీట్‌కు చైర్మన్ ఆమోదించలేదు. దీనితో ఈనెల 30లోగా కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఈనెలలో మిగిలింది వారమే. అజెండా సిద్ధంచేసి, కౌన్సిలర్లకు తెలపడానికి కనీసం మూడురోజుల ముందైనా అజెండా పంపాలి.

ఆమోదం కౌన్సిల్ ఇష్టం

అజెండాలో పెట్టిన అంశంపై సోమవారం కమిషనర్ కే.ప్రమీల వివరణ కోరగా అజెండాలో అంశాలను ఆమోదించాలో తిరస్కరించాలో కౌన్సిలర్ల ఇష్టమని స్పష్టం చేశారు. ఈనెలాఖరులోగా సమావేశం నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు.